# చురుగ్గా వార్షిక పరీక్షలకు ఏర్పాట్లు

- ఈనెల 20 నుంచి సమ్మేటివ్ అసెస్‌మెంట్-2
- 1 నుంచి 9వ తరగతులకు సీబీఏ విధానంలో నిర్వహణ
- మండల కేంద్రాలకు చేరిన ఓఎంఆర్‌లు, ప్రశ్నాపత్రాలు
- మే 1నుంచి పాఠశాలలకు వేసవి సెలవులు



గణపవరం ఎంఈవో కార్యాలయంలో ఓఎంఆర్ షీట్లు కట్టలు కడుతున్న సీఆర్పీలు

**నిడమర్రు :** విద్యా సంవత్సరం ముగింపులో నిర్వహించే వార్షిక పరీక్షలకు చురుగ్గా ఏర్పాట్లు జరుగుతున్నాయి. దీనిలో భాగంగా ఒకటో తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకూ సంగ్రహణాత్మక మూల్యాకనం (ఎస్‌ఏ)-2ను క్లాస్ రూమ్ బేస్డ్ అసెస్‌మెంట్ (సీబీఏ) విధానంలో ఈ నెల 20 నుంచి నిర్వహించనున్నారు. 1-5 తరగతులకు ఈనెల 20 నుంచి 27 వరకూ ఉదయం 9 నుంచి 12 గంటల వరకు. 6-9 తరగతులకు 20 నుంచి 29వ తేదీ వరకూ ఉదయం పూట పరీక్షలు నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. ఈ ఎస్‌ఏ-2 పరీక్షలను పబ్లిక్ పరీక్షలు మాదిరిగా పూర్తి పారదర్శకంగా నిర్వహించేలా విద్యాశాఖ అన్ని ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు. ఉంగుటూరు నియోజకవర్గంలో ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలలో 1నుంచి 9వ తరగతి చదుతున్న 27, 200 మంది ఈ పరీక్షలకు హాజరుకానున్నారు.

**ఎస్‌ఏ-2 సీబీఏ విధానంలో..**

క్లాస్ రూమ్ బేస్డ్ అసెస్‌మెంట్ (సీబీఏ) విధానంలో సమ్మేటివ్-2 పరీక్షలను నిర్వహించనున్నారు. ప్రస్తుత విద్యాసంత్సరంలో ఎస్సీఆర్టీ సీబీఏ విధానాన్ని కొన్ని పరీక్షలకు అమలు చేస్తున్నట్లు ముందుగానే ప్రకటించారు. ఎఫ్‌ఏ-1, ఎఫ్‌ఏ-3 పరీక్షలను ఇప్పటికే సీబీఏ విధానంలో నిర్వహించారు. ఎఫ్‌ఏ-2, ఎఫ్‌ఏ-4, సమ్మేటివ్-1 పరీక్షలను పాత విధానంలోనే నిర్వహించారు. ఈ ఎస్‌ఏ-2 పరీక్షలను ఓఎంఆర్ విధానంలో విద్యార్థులు రాయాల్సి ఉంది.

**టైమ్ టేబుల్ ఇలా**

1-2 తరగతులకు 20న తెలుగు, 24న ఇంగ్లీషు, 25 గణితం, 3-5 తరగతులకు 20న తెలుగు, 24న ఇంగ్లీషు, 25న గణితం, 26న పరిసరాల విజ్ఞానం, 6-9 తరగతులకు 20న తెలుగు, 24న హిందీ, 25న ఇంగ్లీషు, 26న గణితం, 27న జనరల్ సైన్స్, 28న సోషల్ స్టడీస్, 29న కాంపోజిట్ కోర్సుల పేపర్-1 మే 4న కాంపోజిట్ కోర్సు పేపర్-2 నిర్వహించాల్సి ఉంది.

**మండల కేంద్రాలకు ప్రశ్నాపత్రాలు**

మండల విద్యాశాఖ కార్యాలయాలకు ఇప్పటికే జిల్లా కామన్ ఎగ్జామ్ బోర్డు నుంచి ఓంఎంఆర్ పత్రాలు, ప్రశ్నాపత్రాలు అందాయి. వీటిని పాఠశాలల వారీగా, తరగతి వారీగా బండిల్స్ కట్టే పనిలో సీఆర్పీలు నిమగ్నమయ్యారు. పరీక్షలు ప్రారంభం నుంచి సంబంధిత ప్రశ్నాపత్రాల బండిళ్లను ఏరోజుకారోజు పరీక్షకు గంట ముందు నుంచి సీఆర్పీల ద్వారా పాఠశాలలకు చేరేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

**ఏరోజు ప్రశ్నాపత్రం ఆరోజే**

ఓఎంర్ షీట్స్ ముందుగానే పాఠశాల వద్దకు చేరేలా చర్యలు తీసుకున్నా, ప్రశ్నాపత్రాల విషయంలో మాత్రం ఏరోజు ప్రశ్నాపత్రం అదేరోజు పాఠశాలకు చేరేలా ఎంఈవోలు, స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్‌లు బాధ్యత తీసుకోవాలి. ప్రాథమికోన్నత, ఉన్నత పత్రాల భద్రతకు ట్రంకు పెట్టెలు ఏర్పాటు చేసుకోవాలి. పరీక్ష సమయం మొదలయ్యే వరకూ ప్రశ్నాపత్రాల బాధ్యత హెచ్‌ఎంలదే. ఎంఈవోల నుంచి ప్రశ్నాపత్రాలు తీసుకువెళ్లే సమయంలో ఆథరైజేషన్ లెటర్ ఇవ్వాల్సి ఉంది. హెచ్‌ఎం ఆధ్వర్యంలో పరీక్షలు పారదర్శకంగా, సమర్థవంతగా నిర్వహించడమే కాకుండా మూల్యాంకనం పాఠశాల స్థాయిలోనే జరపాల్సిఉంది. మూల్యాకనం అనంతరం విద్యార్థి ప్రగతి పత్రాల్లో నమోదు చేసి విద్యార్థులకు అందించాల్సిన బాధ్యత సంబంధిత తరగతి ఉపాధ్యాయులదే అని విద్యాశాఖ ఉత్తర్వుల్లో పేర్కొంది. పరీక్షలు పూర్తయిన తర్వాత సంబంధిత ఓఎంఆర్ షీట్స్ తరగతి వారీగా కట్టలు కట్టి సీల్ చేసి మండల విద్యాశాఖ కార్యాలయం సిబ్బందికి అందించాల్సి ఉంది. వార్షిక పరీక్షలు అనంతరం మే 1 నుంచి జూన్ 12 వరకూ పాఠశాలలకు వేసవి సెలవులు విద్యాశాఖ అధికారులు ప్రకటించారు.

**29 నుంచి ఆన్‌లైన్‌లో నమోదు**



ఈనెల 29 నుంచి ఎస్‌ఏ-2 పరీక్షల మార్కులు ఆన్‌లైన్‌లో నమోదు ప్రారంభించాలి. 1నుంచి 5వ తరగతి వరకూ 50 మార్కులకు, 6 నుంచి 8 తరగతుల వరకూ 80 మార్కులకు, 9వ తరగతికి మాత్రం 100 మార్కులకు వార్షిక పరీక్షలు జరుగుతాయి. పరీక్షల అనంతరం తల్లిదండ్రుల సమావేశం ఏర్పాటు చేసి విద్యార్థుల ప్రగతి చర్చించి ప్రోగ్రెస్ కార్డులు అందించాలి.

– పుచ్చల శేషు, ఎంఈవో, నిడమర్రు

## లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు



విశేషాలంకరణలో దర్శనమిస్తున్న లక్ష్మీనరసింహస్వామి

**పెదపాడు :** మండలంలోని ఏపూరు గ్రామంలో లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూలవర్లకు అభిషేకం, తీర్థగోష్ఠి, అనంతరం స్వామి వారిని పెండ్లికుమారుడిగా అలంకరించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచన, అగ్ని ప్రతిష్ఠాపన మూర్తి కుంభ ప్రతిష్టాపన కళ్యాణోత్సవాంగ హోమం, ధ్వజారోహణం జరిగాయి. సాయంత్రం 6 గంటల నుంచి చతుస్థానార్చనలు రాయభారోత్సవం, ఎదుర్కోలు ఉత్సవం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ధ్వజారోహణలో పాల్గొన్న సంతానం లేని భక్తులకు గరుడ ప్రసాదాన్ని అందించారు.

## క్లుప్తంగా

### నాగాశ్వని అమ్మవారి ఆలయానికి విరాళం



అమ్మవారికి పూజలు చేస్తున్న గారపాటి చౌదరి

**దెందులూరు :** గాలాయగూడెంలోని శ్రీ నాగాశ్వని అమ్మవారి ఆలయానికి తపన సంస్థ అధినేత గారపాటి చౌదరి రూ. 25 వేలు విరాళం అందజేశారు. తొలుత అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం ఆలయ కమిటీ సభ్యులకు ఈ విరాళం అందించారు. ఈ సందర్భంగా చౌదరిని ఆలయ కమిటీ సభ్యులు సత్కరించారు.

### బాధితుని కుటుంబానికి ఆర్థిక సహాయం



బాధితుని కుటుంబ సభ్యులకు రూ. 20 వేలు నగదు అందజేస్తున్న నాని

**దెందులూరు :** మండలంలో కొమిరేపల్లి హైవే వద్ద ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కడిమే సతీష్ కుటుంబ సభ్యులకు ఆదివారం వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని రూ.20 వేలు ఆర్థిక సహాయం అందించారు. వైఎస్సార్‌సీపీ ఏలూరు పార్లమెంటరీ జిల్లా ప్రధాన కార్యదర్శి పులవర్తి సంతోష్ ఆధ్వర్యంలో సతీష్ కుటుంబ సభ్యులు నానిని కలిశారు. తమ కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని కోరారు. అనంతరం నాని వారికి ఆర్థిక సహాయం అందజేసి బాధిత కుటుంబానికి వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో కొమిరేపల్లి ఎంపీటీసీ పులవర్తి వరమణి, వైఎస్సార్‌సీపీ నాయకులు గుర్రం దిలీప్, యోహోను, శ్రీను ఉన్నారు.

### వడలమ్మకు సామూహిక సారె



భక్తులు సమర్పించిన సామూహిక సారె

**నిడమర్రు :** బువ్వనపల్లి గ్రామ దేవత శ్రీ వడలమ్మ అమ్మవారికి ఆదివారం సామూహిక సారెను సమర్పించారు. గ్రామంలోని మహిళలు ఊరేగింపుగా మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ ఆలయానికి చేరుకుని పెద్ద ఎత్తున బిందెలలో నింపిన సారెను అమ్మవారికి సమర్పించారు. ఎమ్మెల్యే వాసుబాబు స్వగ్రామం బువ్వనపల్లి కావడంతో ఆయన కుటుంబ సమేతంగా సారెను ఊరేగింపుగా తీసుకువెళ్లి అమ్మవారికి సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ప్రతి నెలా ఏకాదశి సందర్భంగా నిర్వహించే ఏకనామా ఏకాహం కార్యక్రమం నేటికి ఏడాది పూర్తయిన సందర్భంగా అమ్మవారికి భక్తులు సారెను సమర్పించినట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున గ్రామస్తులు పాల్గొన్నారు.

### మజ్జిగ చలివేంద్రం ప్రారంభం

**ఉంగుటూరు :** బాదంపూడి గ్రామంలో గునుపల్లి నాగు కుమారుడు స్వర్గీయ మణికంఠ పేరును ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని సర్పంచి కంకట పద్మలీల వెంకట్రావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గులుపెల్లి నాగేశ్వరరావు, దుబాయి వెంకటేశ్వరరావు, మాజి ఎంపీటీసీ రాంబాబు, వైఎస్సార్ సీపీ నాయకుడు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థుల దీక్షకు మద్దతు

**ఏలూరు (ఆర్‌ఆర్‌పేట):** ఏలూరులో ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు శాశ్వత భవనాలు సాధించుకునేందుకు విద్యార్థి సంఘాలు సోమవారం నుంచి చేపట్టనున్న నిరాహార దీక్షకు తన మద్దతు ఉంటుందని ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాల స్థాపించి 15 ఏళ్లు గడుస్తున్నప్పటికీ స్థలం కేటాయించి భవన నిర్మాణాలు చేపట్టకపోవడం విచారకరమన్నారు. అనేక విద్యార్థి సంఘాలు, ప్రజా సంఘాలు, కార్మిక సంఘాల పోరాటాల ఫలితంగా 2008లో డిగ్రీ కళాశాల మంజూరైందని, అప్పటి నుంచి ఎన్ని ప్రాతినిధ్యాలు చేసినప్పటికీ భవన నిర్మాణం కార్యరూపం దాల్చలేదన్నారు. జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఆ కళాశాల భవనంలో సర్దుకుని తరగతులు నిర్వహించాల్సిన దుస్థితి నెలకొందన్నారు. అనేక సార్లు ఉన్నతాధికారులకు, మంత్రుల దృష్టికి సమస్యను తీసుకువెళ్లినప్పటికీ ఫలితం లేదన్నారు. ఏలూరులో ఇప్పటివరకు ఎయిడెడ్ డిగ్రీ కళాశాలలుగా ఉన్న సీఆర్‌ఆర్ డిగ్రీ కళాశాల, సెయింట్ థెరిస్సా డిగ్రీ కళాశాలలకు ప్రభుత్వం ఎయిడెడ్ ఉపసంహరించుకోవడంతో ప్రైవేట్ కళాశాలలుగా మారిపోయాయని, దీంతో పేద విద్యార్థులకు డిగ్రీ చదివే అవకాశం ఉన్న ఏకైక కళాశాలగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఒక్కటే అందుబాటులో ఉందన్నారు. విద్యార్థుల ఆందోళనలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం, అధికారులు తక్షణమే స్పందించాలని కోరారు.

## వ్యాయామంతో వ్యాధులు దూరం



వైద్యనిపుణులను సన్మానిస్తున్న గణపవరం పీఎంపీ అసోసియేషన్ సభ్యులు

**గణపవరం :** రోజూ కనీసం అరగంట సమయం నడక, వ్యాయామాలు చేస్తే ఆస్పత్రుల చుట్టూ తిరిగే అవసరం రాదని పలువురు వైద్యనిపుణులు సూచించారు. ఆదివారం గణపవరం పీఎంపీ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులు, వేసవిలో వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సుకు పీఎంపీ అసోసియేషన్ మండల అధ్యక్షుడు ఎం.సత్యనారాయణమూర్తి అధ్యక్షత వహించారు. సదస్సులో ప్రముఖ జనరల్ వైద్య నిపుణుడు ఎస్‌వీ గోపాలరాజు మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితులలో ఊబకాయం, బీపీ, షుగర్ వ్యాధులు ప్రాణాంతకంగా మారి గుండెపోటుకు దారితీస్తున్నాయని, నిత్యం కొంతసమయం వ్యాయామం చేస్తే వ్యాధులు దరిచేరవన్నారు. వేసవిలో వడదెబ్బకు గురికాకుండా తగిన రక్షణ చర్యలు తీసుకోవాలని, ప్రతి అరగంటకోసారి నీరు తాగాలని సూచించారు. కొంతకాలంగా సీజనల్ వ్యాధులు ప్రజలను ఇబ్బంది పెడుతున్నాయని, పరిశుభ్రత, దోమల నుంచి రక్షణతో మలేరియా, టైఫాయిడ్, డెంగీ వంటి విషజ్వరాలకు దూరంగా ఉండవచ్చునన్నారు. పీఎంపీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నిడమర్తి జయసూర్య మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. తమ సంఘం ద్వారా ప్రతి నెలా వైద్య నిపుణులతో ఆరోగ్య అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే పేదలకు ఉపయోగపడేలా ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటుచేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పీఎంపీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఏఆర్‌కే పరమేశ్వర్లు, గణపవరం మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## వీరేశలింగం పంతులు సేవలు మరువలేనివి



పూళ్లలో నీతి కథలు చదువుతున్న చిన్నారులు

**భీమడోలు :** నవయుగ వైతాళికుడు, సాహితీవేత్త, గద్య తిక్కన్న కందుకూరి వీరేశలింగం పంతులు సేవలు మరవలేనివని పలువురు వక్తలు అన్నారు. మండలంలోని భీమడోలు, పూళ్ల, గుండుగొలను శాఖా గ్రంథాలయాల్లో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని నిర్వహించారు. కందుకూరి వీరేశలింగం పంతులు 175వ జయంతి సందర్భంగా భీమడోలు శాఖా గ్రంథాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గ్రంథపాలకులు కేఎస్ రావు మాట్లాడుతూ స్త్రీ విద్య, వితంతువు రెండో వివాహం, బాల్య వివాహాలు, వరకట్నం వంటి సాంఘిక రుగ్మతలను రూపుమాపేందుకు వీరేశలింగం పంతులు ఎనలేని కృషి చేశారన్నారు. అనంతరం చిన్నారులు ఎంపిక చేసిన పుస్తకాలను చదివారు. కార్యక్రమంలో గ్రంథపాలకులు డీఎస్‌బీ అమర్‌నాథ్, జి.నాగమణి, పెద్దలు సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

## మహిళాభ్యున్నతికి ఎనలేని కృషి



కందుకూరి వీరేశలింగం పంతులు జయంతి నిర్వహిస్తున్న మానవత సభ్యులు

**పెదపాడు :** మహిళల అభ్యున్నతి కోసం విశేషంగా కృషిచేసిన నవయుగ వైతాళికుడు కందుకూరి వీరేశలింగం పంతులు అని మానవత సభ్యులు పేర్కొన్నారు. అప్పనవీడులోని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో వీరేశలింగం పంతులు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు నివాళులర్పించారు. కార్యక్రమంలో మానవత సభ్యులు పాల్గొన్నారు.

## ప్రచార భేరి గోడ పత్రికల ఆవిష్కరణ



భీమడోలులో గోడ పత్రికలను ఆవిష్కరిస్తున్న జిల్లా కార్యదర్శి ఆర్.లింగరాజు తదితరులు

**భీమడోలు :** కేంద్రంలో మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న దేశ వ్యతిరేక, ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలను చైతన్యవంతులు చేసేందుకు సీపీఎం, సీపీఐ పార్టీల ఆధ్వర్యంలో ఈనెల 17, 18వ తేదీల్లో ప్రచార భేరి నిర్వహిస్తున్నామని సీపీఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఆర్.లింగరాజు తెలిపారు. భీమడోలులో ఆదివారం ప్రచార భేరి గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉంగుటూరు నియోజకవర్గంలో, ద్వారకాతిరుమల మండలాల్లో ప్రచార భేరి కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. ప్రజలపై భారాలు మోపుతూ కార్పొరేట్ శక్తులకు రాయితీలు ఇచ్చి బీజేపీ నీచ రాజకీయాలు చేస్తోందని మండిపడ్డారు. హిందుత్వ ముసుగును వేసుకుని ప్రజలను మోసగిస్తోందన్నారు. బీజేపీ నిర్ణయాలను ఎండగట్టేందుకు సీపీఎం, సీపీఐ పార్టీల ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు ప్రచార భేరిలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, సీపీఎం నాయకులు కట్టా భాస్కర రావు, వై.సాల్మన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

## అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి



అపార్ట్‌మెంట్ వాసులకు అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక అధికారి నాగరాజు

**భీమడోలు :** ఎత్తైన ప్రదేశాలు, అపార్ట్‌మెంట్లలో నివాసించే వారంతా అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని భీమడోలు అగ్నిమాపకాధికారి జి.నాగరాజు అన్నారు. జాతీయ అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మూడో రోజైన ఆదివారం భీమడోలులోని పలు అపార్ట్‌మెంట్ల వద్దకు వెళ్లి అగ్నిమాపక సిబ్బంది కరపత్రాలను అందించారు. అక్కడ ఉన్న అపార్ట్‌మెంట్ వాసులు, మహిళలకు అగ్ని మాపక ప్రమాదాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. గ్యాస్ సిలిండర్ ద్వారా గ్యాస్ లీకై మంటలు వస్తున్న తరుణంలో మంటలు ఆర్పే విధానాన్ని మహిళలకు వివరించారు. అగ్నిమాపకాధికారి జి.నాగరాజు మాట్లాడుతూ గ్యాస్ లీకైన తక్షణమే స్పందిస్తే ముంపు ఉండబోదని, అదమరిస్తే పెను ప్రమాదం మన వెన్నంటే ఉంటుందన్నారు. ప్రమాదం సంభవిస్తే 100 గాని 101కు ఫోన్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అగ్ని మాపక సిబ్బంది, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## ఇంటింటా సంక్షేమ కాంతులు



కోమర్రులో ప్రజాభిప్రాయాన్ని నమోదు చేస్తున్న ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు



పోలసానిపల్లిలో ప్రజాభిప్రాయ సేకరణ చేస్తున్న సర్పంచ్ షేక్ రహీమాబేగం హసీనా, ఎంపీటీసీ దేవి ప్రసాద్



దెందులూరులో లబ్ధిదారులకు కిట్లు అందజేస్తున్న తొత్తడి వేదకుమారి, పార్టీ శ్రేణులు



పెదవేగిలో మా నమ్మకం నువ్వే జగన్ అంటూ స్టిక్కర్లను చూపిస్తున్న ప్రజలు

**గణపవరం :** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాటప్రకారం ప్రతి హామీని అమలుచేస్తూ నాలుగేళ్లుగా రాష్ట్రంలో సంక్షేమ పాలన అందిస్తుండడంతో ఇంటింటా ఆనందం వెల్లివిరుస్తోందని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. ఆదివారం గణపవరం మండలం కోమర్రు సచివాలయం పరిధిలో నిర్వహించిన నువ్వే మా నమ్మకం జగన్ కార్యక్రమంలో ఆయన ఉత్సాహంగా పాల్గొన్నారు. గృహసారథులు, వలంటీర్లు, పార్టీ నాయకులతో కలిసి ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి వివరించారు. పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అన్నది మీ ద్వారా తెలుసుకుని, లోపాలు సరిదిద్దడానికే ఈకార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. నాలుగేళ్లలో ఆయా కుటుంబాలకు అందిన పథకాలను వివరించి బ్రోచర్లు అందజేశారు. ఇళ్ల యజమానుల అనుమతితో జగనన్నే మాభవిష్యత్ స్టిక్కర్లను ఆయా గృహాలకు అతికించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాసుబాబు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఇంత వరకూ ఏప్రభుత్వమూ అమలు చేయని సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న వైఎస్ జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిని చేయడానికి ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని, ప్రజల అండ ఉన్నంతకాలం వైఎస్ జగన్‌ను ఓడించడం ఎవరితరం కాదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అర్థవరం రాము, సర్పంచ్ కేశవరపు శైలజ, ఎంపీటీసీ వడ్డి సీతామహాలక్ష్మి, సొసైటీ అధ్యక్షుడు వడ్డి గంగరాజు, గ్రామ పార్టీ నాయకులు గంటసాల శ్రీనివాస్, వడ్డి ఉమ, కేశవరపు వెంకటేశ్వరరావు, గుమ్మాలూరి లోకేష్, విప్పర్తి శ్రీనివాస్, విప్పర్తి పద్మారావు, ఉపసర్పంచ్ కసాని వెంకట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

**ముప్పర్తిపాడులో ఉత్సాహంగా**

ముప్పర్తిపాడు గ్రామంలో ఆదివారం మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. మండల సచివాలయ కన్వీనర్‌లు, పార్టీ నాయకులు, వలంటీర్లు, గృహసారథులతో కలసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. సంక్షేమ పథకాల లబ్ధి గురించి ఆరాతీశారు. ప్రజామద్దతు పుస్తకంలోని ఐదు ప్రశ్నలకు జవాబులు రాసుకున్నారు. ప్రజల అనుమతితో ఇంటి గోడలకు మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లను అంటించారు.

**అనూహ్య స్పందన**

**భీమడోలు :** జగనన్నే మా భవిష్యత్, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తోంది. మండల వ్యాప్తంగా ప్రజాప్రతినిధులు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు ఇంటింటికీ వెళ్లి ప్రజల అభిప్రాయాలను సేకరించారు. పోలసానిపల్లి, గుండుగొలను, ఎంఎంపురం, భీమడోలు, అంబర్‌పేట, వడ్లపట్ల, ఆగడాలలంక గ్రామాల్లో ఈ కార్యక్రమం జోరుగా సాగింది. పోలసానిపల్లి సర్పంచ్ షేక్ రహీమా బేగం హసీనాతో పాటు ఎంపీటీసీ అంబటి దేవీ ప్రసాద్, వార్డు సభ్యులు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు ఆదివారం ఇంటింటికీ వెళ్లి ప్రజాభిప్రాయం సేకరించారు. జగనన్నే మాకు అండ అని, ఆయన మరలా సీఎం కావాలంటూ ప్రజలు ముక్తకంఠంతో సమాధానమవ్వడంతో సంతోషం వ్యక్తం చేశారు.

**దెందులూరు :** దెందులూరులో ఆదివారం జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ దెందులూరు నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు తొత్తడి వేదుకుమారి, పార్టీ గ్రామ అధ్యక్షుడు పోకల రాంబాబు, మండల కన్వీనర్ కట్టా ఏసుబాబు, సొసైటీ చైర్మన్ కొలుసు గణపతిరావు, గృహసారథులు, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహించారు. ప్రభుత్వ పథకాల అమలుపై ప్రజాభిప్రాయ సేకరణ చేశారు. అనంతరం జగనన్న కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా తొత్తడి వేదకుమారి మాట్లాడుతూ మా ప్రభుత్వంలో మేలు జరిగిందంటేనే మాకు ఓటు వేయండని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అడుగుతున్నారంటే ప్రజల నుంచి ఎంతటి మద్దతు ఉందో అర్థమవుతుందన్నారు. పాదయాత్రలో ఇచ్చిన హామీల అమలుతోపాటు నవరత్నాల పథకాలు అమలుచేసి ప్రజల సంక్షేమానికి, అభివృద్ధికి కృషి చేస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పులిపాటి ఆనంద్, వైఎస్సార్‌సీపీ నాయకులు పులిపాటి శ్యామలాదేవి, వన్నెకూటి సుందరం, తొత్తడి కృష్ణ, కాంద్రు ప్రసన్న రవి పాల్గొన్నారు.

**పెదవేగి :** మండలంలోని అన్ని గ్రామాల్లో ఆదివారం మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం విస్తృతంగా నిర్వహించారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సప్పా మోహనమురళి అధ్యక్షతన పార్టీ శ్రేణులు ఇంటింటికీ వెళ్లి ప్రజాభిప్రాయం సేకరించారు. దుగ్గిరాల, సూర్యారావుపేటలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం ఉత్సాహంగా నిర్వహించారు.

## శరవేగంగా జగనన్న ఇళ్ల నిర్మాణం

**దెందులూరు :** కొత్తగూడెం పంచాయతీ కోమిరేపల్లి గ్రామంలో జగనన్న ఇళ్ల నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. శింగవరం గట్టు వద్ద గిరిజనులకు సీఎంఓ కార్యాలయం సమన్వయంతో స్వచ్ఛంద సంస్థ ఇళ్లను నిర్మిస్తోంది. ఆదివారం గ్రామ సర్పంచ్ పరసా లక్ష్మిసుజాత, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు కోటిపల్లి సురేష్, పార్టీ జిల్లా పార్లమెంటరీ ప్రధాన కార్యదర్శి పులవర్తి సంతోష్, నాయకులు గుర్రం దిలీప్ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు.

## నేడు బొమ్మిడిలో గడపగడపకు

**ఉంగుటూరు :** బొమ్మిడి గ్రామంలో సోమవారం సాయంత్రం 4 గంటలకు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు పాల్గొంటారని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మరడ మంగరావు తెలిపారు. అలాగే మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ఆయా కార్యక్రమాల్లో మండలంలోని ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

## ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలి

**పెదపాడు :** కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 19, 20 తేదీల్లో నిర్వహిస్తున్న ప్రచార భేరి యాత్రను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కే శ్రీనివాస్ కోరారు. పెదపాడులోని నర్రా ఆంజనేయులు భవనంలో ప్రచార భేరి యాత్ర పోస్టర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ గద్దెనెక్కిన నాటి నుంచి ప్రజలపై మోయలేని భారాలు మోపుతోందని విమర్శించారు. గ్యాస్, పెట్రోల్, డీజిల్ కరెంటు చార్జీలను పెంచి ప్రజల నడ్డి విరిచిందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతూ ప్రజా సంపదను దోచిపెడుతోందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. సీపీఎం నాయకులు లింగం కృష్ణారావు, గుండపనేని సురేష్, షేక్ కరీముల్లా, రెడ్డి లక్ష్మణరావు, షేక్ బాషా తదితరులు పాల్గొన్నారు.

## 14 మందిపై కేసు నమోదు

**దెందులూరు :** ఇటీవల జాతీయ రహదారిపై దెందులూరు మండలం కొమిరేపల్లి వద్ద రోడ్డు ప్రమాదంలో సతీష్ అనే వ్యక్తి మృతి చెందిన ఘటనలో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించి పోలీసుల విధులకు ఆటంకపరిచిన 14 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఐ.వీర్రాజు తెలిపారు. విచారణ నిర్వహించి చర్యలు తీసుకుంటామని ఎస్సై చెప్పారు.

## జూదరుల అరెస్ట్

**పెదపాడు :** పెదపాడు శివారు కొండదొర కాలనీలో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు దాడి చేసి ఐదుగురిని అరెస్ట్ చేసి, రూ.2800 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై బి.నాగబాబు తెలిపారు.